"ఇతడు నా ఢిల్లీ స్నేహితుడు కృష్ణ. ఇతడు నాతోటి ఐ. ఎ. ఎస్. ప్రొబేషనర్ విఠల్" అని పరిచయం చేసేడు పద్మనాభన్.

కృష్ణ, విఠల్ కరచాలనం చేసుకున్నారు.

"మీ చేయి చూడమని పద్మనాభన్ చెప్పేడు. మీకు అభ్యంతరం లేకపోతే...." అన్నాడు విఠల్.

"నాకేమీ అభ్యంతరం లేదు" అన్నాడు కృష్ణ. "ఎటూ వచ్చి, మీ పరీక్షల సమయంలో నేను ఈ ఊరు రావడమే తప్పు. పైగా ఇటువంటి విషయాల మీద మీ కాలం వృథా పరచడమంటే నాకు ఇష్టం లేకపోయింది."

"చెప్పేగా, ఈ పరీక్ష ఒక పరీక్ష కాదని" అన్నాడు పద్మనాభన్.

విఠల్ టేబిల్‌లైటు వెలిగించేడు. ఆ కాంతిలో కృష్ణ చేతులను నిశ్శబ్దంగా పది నిమిషాల కాలం పరీక్షించేడు.

"ప్రత్యేకంగా ఏమైనా తెలుసుకోవాలా?" అని అడిగేడు విఠల్.

"మామూలుగానే చెప్పండి" అన్నాడు కృష్ణ.

"పెళ్లి ఎప్పుడు అవుతుందో చూసి చెప్పు" అన్నాడు పద్మనాభన్.

కృష్ణ నవ్వేడు.

"మీ ముపఏయ్యవ ఏడులోగా తప్పకుండా జరుగుతుంది. అంటే వచ్చే ఏడాదిలోగా అన్నమాట" అని కొంచెంసేపు ఆగి అన్నాడు విఠల్: "ఇదివరకు ఒక సంబంధం అనుకొన్నాక అడుగున పడిపోయింది. అవునా?"

"అవును."

"ఆ సంబంధం తప్పిపోయినట్టే. ఇదిగో — ఈ హార్టులైను రెండుగా చీలిపోవడంలో అర్థం అదే. ఇంకొక విషయం స్పష్టంగా తెలుస్తోంది. ఈ పరిస్థితికి బాధ్యులు ఇంకెవరో కారు. మీరే. అవునా?"

"అవును."

"హెడ్‌లైను కూడా విచిత్రంగా ఉంది. చెరొక చివరినుండి రెండు గీతలు బయలుదేరి మధ్యలో కలవకుండా ఉండిపోయేయి. అవి మీ మనస్సులోని అస్థిమితమయిన విచిత్ర భావాలను తెలుపుతున్నాయి. పరిపక్వం కావలిసిన జీవితాన్ని మీ వెర్రి ఆలోచనలతో కొంతవరకు చెడగొట్టుకుంటారు. మీ ఎడమ చేతిని చూడండి, రేఖలన్నీ ఎంత సక్రమంగా ఉన్నాయో! అంటే హృదయానికీ, మనస్సుకూ సంబంధించిన విషయాలలో అవకతవకలకు కేవలం మీరే కారకులు.

"మీలో చిత్తశుద్ధి కలిగేది, మీకు పెళ్లయిన తరవాతనే.

"మీ భార్యవల్ల కూడా మీకు డబ్బు చేకూరుతుంది. మీ ఆరోగ్యం బాగుంటుంది. తెలివితేటలకు లోటులేదు. ఒక ఏడాదిలోగా పై ఉద్యోగం రావడమో లేక కొత్త ఉద్యోగంలో చేరడమో జరుగుతుంది. ఇంకేమైనా విషయాలు ఉన్నాయా?"

"కళానైపుణ్యం ఏమైనా ఉందా?"

"ఆఁ. మీ చేతి రూపం, ఈ శుక్రస్థానం మీరు కళాసేవకులని తెలుపుతున్నాయి."

"దైవభక్తి?"

క్షణం ఆలోచించి అన్నాడు విఠల్: "లేదు.

జ్యోతిషం శాస్త్రం కాదని పలువురు ఘంటాపథంగా చెబుతారు. గ్రహాలను నమ్ముకొని జీవితం గడపడానికి ప్రయత్నించడం అంతటి అవివేకం మరొకటి ఉండదని బల్లగుద్ది వాదిస్తారు. ఈలాంటి మూఢ నమ్మకాలు నశిస్తే కాని దేశానికి గతి ఉండదని వాపోతారు. కాని జ్యోతిష్కుడు కనిపిస్తే మాత్రం జాతకచక్రం చూపకుండా ఉండలేరు — అదేమి చిత్రమో!

---

ఏమాత్రం ఉన్నా అది కేవలం తాత్కాలికమే."

రెండు నిమిషాలు గడిచేయి. టీ తాగి, విఠల్‌వద్ద సెలవు తీసుకొని, కృష్ణ, పద్మనాభన్ బయలుదేరేరు, అందాల ఛార్లీవిల్ భవనంనుండి ఒక మెట్టు ఎత్తులో ఉన్న బెన్‌మోర్ భవనంవైపు.

గది చేరుకోగానే, "ఇప్పుడే వస్తా"నని చెప్పి పద్మనాభన్ వెళ్లిపోయేడు.

ఢిల్లీలో పది శీతాకాలాలు గడిపిన కృష్ణకు ముస్సోరీలో సెప్టెంబరు చలి అంతగా అనిపించలేదు. అయినా ఎండలో కుర్చీ వేసుకొని కూర్చున్నాడు.

ఠీవిగా నిలుచుని ఉన్న ముస్సోరీ కొండలకు మబ్బులు ముసుగు మనుష్యులవలె వచ్చి, ఏదో రహస్యం చెప్పి వెళ్లిపోతున్నాయి. కృష్ణకు రెండేళ్ల క్రితంనాటి యాత్ర గుర్తుకు వచ్చింది.

మహాబలేశ్వర్... అతి రమణీయమైన ప్రదేశం. నిమిష నిమిషానికి రూపాల్ని మార్చుకుంటూన్న ఆ పర్వత శిఖరాలను చూడడానికి రెండు కళ్లు చాలవు. మనస్సు ఇట్టే నిండిపోతుంది.

కృష్ణ, అతని పంజాబీ స్నేహితుడు సింగ్ కొత్త మహాబలేశ్వర్‌లో సైకిళ్ల మీద బయలుదేరి ఒక దిక్కులో చూడవలిసిన ప్రదేశాలను చూసేరు. దారి పొడవునా వర్షం పడుతూనే ఉంది. శక్తితో, ఉత్సాహంతో వర్షాన్నీ, కొండ ఎత్తులనూ లెక్క చేయక ముందుకు సాగేరు. తిరిగి వస్తూండగా వర్షం అధికమయింది. బాగా చీకటి పడిపోయింది. మెల్లిగా సైకిళ్లు తోసుకుంటూ, పాత మహాబలేశ్వర్ చేరుకున్నారు. ఆ రాత్రి అక్కడే ఒక ఇంట్లో గడిపివేసేరు.

మరునాడు ఉదయమే లేచి పాత మహాబలేశ్వర్‌లో ఉన్న శివుని గుడికి వెళ్లేరు. గుడి ముందు ప్రాంగణంలో అయిదు నీటి ధారలు ఉన్నాయి. అయిదు నదుల ఆది ఆ స్థలం. అవి కృష్ణ, గాయత్రి మొదలయినవి.

కృష్ణ ఆలోచనా పరంపరకు భంగం కలిగింది.

కృష్ణ, గాయత్రి చిత్రమైన కలయిక! ఏడాది క్రితం కృష్ణచే ప్రేమింపబడి ప్రేమ తెలుపుకొన్న అమ్మాయి గాయత్రి.

ఇంకొక దివ్యమైన బాంధవ్యం గోచరించింది కృష్ణకు. కృష్ణానది ఉరకలు వేస్తూ విజయవాడలో శ్రీ కనకదుర్గాదేవి పాదాలను సోకినట్టే, తను కూడ ఆ దేవి పాదాలకు ఆశ్రితుడయినాడు గాయత్రిని కలుసుకొన్న కొద్ది రోజులకే.

---

## న్యాయపతి గోపాలకృష్ణ

---

వాల్తేరు... శ్రీ కనకదుర్గాదేవి కటాక్షం పొందిన మానవుడు శ్రీరావుగారు. వారు రోజూ రెండు పూటలూ పూజలు చేస్తారు. శ్రీదేవి అనుగ్రహిస్తే వారిలో ఆవేశరూపంలో ప్రవేశిస్తుంది. మానవుల సంశయాలను తీరుస్తుంది. హితోపదేశం చేస్తుంది. తప్పులను మన్నిస్తుంది. ఒకొక్కప్పుడు ఖండిస్తుంది. ఈ కల్లోల ప్రపంచంలో తల్లడిల్లే వ్యక్తులకు అండగా నిలిచి దారి చూపిస్తుంది. అనుగ్రహం కలిగితే, ఆమె వీణావాద్యం స్పష్టంగా వినిపిస్తుంది.

కృష్ణకు ఆమె దర్శనభాగ్యం లభించింది. అతడు ఢిల్లీలో గడుపుతున్న జీవితం గురించి పూస గుచ్చినట్టు చెప్పింది. మామూలుగా దొరకని అందం, ఆనందం కోసమని దురలవాట్లు చేసుకున్నాడని స్పష్టంగా చెప్పింది. తల్లిదండ్రుల ఆత్మలు అశాంతితో కూడుకుని ఉన్నాయనీ, తోబుట్టువులు చాలా చింతిస్తున్నారనీ చెప్పింది. పాత అలవాట్లను మానుకోమంది. నలుగురిలో బుద్ధిగా మెలిగి మంచి పేరు తెచ్చుకోమంది. ఏ ఆపద రాకుండా తను కాపాడతానంది.

సర్వవ్యాపి, సర్వశక్తిమయి, కరుణామయి అయిన శ్రీదేవి తనను రక్షిస్తానని చెప్పిందంటే, తనకు ఈ లోకంలో కావలిసినదేముంది? ఆ క్షణం నుండి సర్వకాల సర్వావస్థలలోనూ ఆమె నామస్మరణ చేస్తూనే ఉన్నాడు కృష్ణ.

గాయత్రితో వివాహం గురించి, ఏడాదిక్రితం శ్రీదేవి చెప్పిన మాటలకు ఆవేళ విఠల్ చెప్పిన మాటలు వ్యతిరేకంగా ఉన్నాయి.

"గాయత్రితో వివాహబంధం గురించి తాపత్రయ పడుతున్నావు కదూ! ఈ కుటుంబ ఏకీకరణ తప్పకుండా జరుగుతుంది. వచ్చే మాఘమాసంలో వివాహం జరుగుతుంది" అని చెప్పింది శ్రీదేవి.

ఒక మాఘమాసం దాటిపోయింది. అంటే శ్రీదేవి చెప్పిన మాటలు ఫలించవా? ఆమెకు తనపట్ల ఆగ్రహం కలిగిందేమో! ఆమె నామస్మరణ చేసినంత మాత్రాన తన ధర్మం నెరవేర్చినట్టేనా? ఆమె చేసిన హితోపదేశాన్ని తనెంతవరకు పాటించేడు?

ఆరునెలల క్రితం...

ఢిల్లీ...ఆదివారం రాత్రి తొమ్మిది గంటలయింది. జేబులో సిగరెట్లు ఉన్నా, దుకాణంలో ఒక సిగరెట్టు కొని, మెల్లిగా వెలిగించి, ఆ పక్కన ఉన్న మేడమెట్లు ఎక్కేడు కృష్ణ. అంతా చీకటిమయం. మెట్లు దిగుతున్న వ్యక్తులు కృష్ణను తప్పించుకుంటూ వెళ్లిపోయేరు. పదిమెట్లు ఎక్కేసరికి ఒక టీ దుకాణం తగిలింది. కృష్ణ టీ తాగేడు. తిరిగి మెట్లు ఎక్కడం ప్రారంభించేడు. ఇంకొక పదిమెట్లు కాగానే, కుడివైపు నుండి "రండి, రండి" అని ఇద్దరి గొంతుకలు వినిపించేయి. అక్కడ బెంచీమీద కూర్చున్న నలుగురు అమ్మాయిలను చూసి, లోపలికి వెళ్లబోయి, ఆగిపోయి, తిరిగి మూడో అంతస్తుకు మెట్లు ఎక్కేడు.

ట్యూబ్‌లైట్ల కాంతి చెప్పతరంకాదు. గోడకు ఆనుకొని ఉన్న ఒక బెంచీమీద ఇద్దరు అమ్మాయిలు, వాళ్లకు చెరొకవైపు నిలుచుని ఇద్దరు అమ్మాయిలు కనిపించేరు. అందులో ముందు నిలుచునిఉన్న అమ్మాయి చాలా చురుకుగా, అందంగా కనిపించింది కృష్ణకు.

"మద్రాసీ?" అన్నాడు కృష్ణ అప్రయత్నంగా.



"ఆఁ."

"ఏ భాష?"

"తెలుగు."

కృష్ణ పరమానందం పొందేడు. అప్పటినుండి తెలుగులో మాట్లాడసాగేడు. "ఏ ఊరు?"

"విజయవాడ."

కృష్ణ కొద్దిగా కంపించేడు.

అతన్ని ఒక గదిలో ప్రవేశపెట్టింది ఆమె.

"చూడు, నేను దేముణ్ణి చూసిన మనిషిని" అన్నాడు కృష్ణ అప్రయత్నంగా.

ఆమె అతనివైపు కొంచెం వింతగా చూసి, క్షణం పోయిన తరవాత అడిగింది: "ఏం, తాగి ఉన్నారా?"

"ఆఁ."

"తాగడం మంచిది కాదు. గుండెల్ని కాల్చేస్తుంది."

కృష్ణ నవ్వేడు.

అయిదు నిమిషాలు గడిచేయి.

"మీరు జ్యోతిష్కులా?"

కృష్ణకు ఆ ప్రశ్న నచ్చలేదు. "అబ్బే, కాను" అన్నాడు.

"మరి మీ పర్సులో అదేమిటి?"

"మా ఊరి శ్రీ కనకదుర్గాదేవి ఇచ్చిన రక్ష" అంటూ పర్సులోనుండి పూసలదండ తీసి ఆమెకు ఇచ్చేడు కృష్ణ. "నీకు అవసరం ఉంటుంది. నువ్వు ఉంచుకో."

ఆమె దాన్ని తీసుకొని తన పర్సులో పెట్టుకుంది.

కృష్ణ బయట పడ్డాడు. 'దేవీ, నీ రక్ష నాకెప్పుడూ ఉంటుంది కదూ' అని అనుకున్నాడు.

తరవాత ఆ ఇంటికి ప్రత్యేకంగా చాలాసార్లు వెళ్లేడు కృష్ణ.

ఈ అవినీతిని శ్రీదేవి ఎలా సహిస్తుంది? ఆమె నామస్మరణ చేసినంతమాత్రాన తను చేసిన పాపాలు పోతాయా? తను ఏ సంజాయిషీ చెప్పినా, ఈ లోకమే అంగీకరించదే! శ్రీదేవి అంగీకరిస్తుందని ఏమిటి నమ్మకం?

"సెలవుమీద ఎప్పుడు వెళుతున్నావ్?" అని అడిగేడు పద్మనాభన్ పక్క కుర్చీలో కూర్చుంటూ.

"వెళ్లాలి, బ్రదర్. ఎంత త్వరగా వెళితే అంత మంచిది."

"గుడ్. వెళ్లి, ఏదో ఒక మంచి సంబంధం చూసుకొని, పెళ్లి ముగించుకొని వచ్చేయి."

"మాట వరసకి చెబుతున్నాను. ఇదివరకు అనుకున్న సంబంధం తప్పిపోయినట్టే అని విశాల్ చెప్పేడా! నేను నీకు ఢిల్లీలో చెప్పేననుకుంటాను — ఇటు ఉన్న సూర్యుడు అటు తిరిగినా, ఆ సంబంధమే అవుతుందని పూజలో శ్రీదేవి చెప్పింది. ఏ కారణంచేతనైనా శ్రీదేవి మాటలు ఫలించకపోతే నాకు మానసికంగా పెద్ద గాయం తగులుతుంది. నిజానికి ఆ అమ్మాయి లభించలేదని కాదు; నేను ఏ దైవాన్ని అయితే నమ్ముకున్నానో ఆ దైవం అనుగ్రహం పోయిందనో లేక ప్రయోజనం లేదనో, ఈ సందిగ్ధత ఇప్పటికే ప్రాణం తీస్తోంది. అందుకే మొట్టమొదట నేను వైజాగ్ వెళ్లాలి."

పద్మనాభన్ క్షణం ఆలోచించి అన్నాడు: "ఆ దేవి ఇప్పుడెలా చెబుతుందో, అలా నడుచుకుంటే సరి."

• • •

ఒక నెలరోజులు దొర్లిపోయేయి.

ముస్సోరీలో చలి తీవ్రత అధికమయింది.

పద్మనాభన్ ఏదో పుస్తకం చదువుతున్నాడు. తలుపు చప్పుడు కాగా వెళ్లి తలుపు తీసేడు.

"ఏం చేస్తున్నావ్, బ్రదర్?" అన్నాడు విశాల్.

"ఇదేదో మంచి పుస్తకం అంటే చదువుతున్నాను. ఇంతకీ నీ ఢిల్లీ యాత్ర ఎలా ఉంది?"

"బ్రహ్మాండంగా ఉంది. అన్నట్టు, ఢిల్లీ కన్నాట్ సర్కసులో తిరుగుతూ ఉండగా ఒకరోజు మీ ఆ స్నేహితుడు దూరంగా వెళ్లిపోతూ ఉండగా చూసేను."

"అంటే...."

"మిస్టర్ కృష్ణ."

"అయితే నువ్వు చూసిన వ్యక్తి అతను కాదు."

"ఏం, ఇప్పుడు ఢిల్లీలో లేడా?"

"ఈ లోకంలోనే లేడు."

విశాల్ విస్మయపడ్డాడు. పద్మనాభన్ ముఖంలో దుఃఖచ్ఛాయలు కమ్మేయి.

విశాల్ మెల్లిగా అన్నాడు: "అప్పుడే నీతో చెబుదామని అనుకుంటూ ఊరుకున్నాను. అతని చేతి రేఖలలో, ఆత్మహత్య చేసుకునే మనస్తత్వం స్పష్టంగా కనిపించేది. కాని ఆ విషయం నేను బయటికి చెప్పలేదు."

"ఆ విషయం అతనికికూడా తెలుసు. ఆ రేఖను గురించి నాతో చాలాసార్లు అన్నాడు."

"ఇంతకీ కారణ మేమిటట?"

"అతడు నమ్ముకున్న దేవత అనుగ్రహం పోయిందని."

"అంటే ఆ అమ్మాయి...."

"పేరు గాయత్రి. పూర్తిగా వేరే దిశలో ప్రవహిస్తోంది." ★

## పొగ క్రోవి — పోచిరాజు శేషగిరిరావు

ఒక్కొకడొక యొడుపులోన
ఒలికించును మధురసమ్ము
ఒక్కొకడొక మడుపులోన
గిలకరించు హాలహలము
—మనుజులలో మమతలేల
పొనుగుపడియె పొలుపు మాలి?
దైనందిన జీవితమ్ము
గణియించును ధనరాసులు
గణియింపదు ధర్మమ్మును
చనినగాని శతాబ్దాలు.
చెలమలు త్రవ్వుట సుకరము,
చెఱువుల నిర్మితి భారము
నిదానముగ పయనించిన
గమ్యము చేరుట తథ్యము.
తెప్పలలో విసము నాపి
అప్పళించు హాసమ్మును
దొప్పలు దొంతరలు గాగ
కుప్పవోయునటకుడొకడు
నిండుకుండ తొణకనియటు
పండిన యనుభవముతోడ
పలుకు, తూచి తూచి యొకడు
మాట విలువ మఱువ డెపుడు.
మనసొక్కెడ—మాట యొకట—
పనియుండును వేఱుచోట—
కనిపించును 'ఘనాపాఠి'
వలె నిండుగ నిబ్బరముగ.
తలపులలో తారాడును
విలయరేఖ లెన్నెన్నియొ:
పలుకులలో పరువులెత్తు
వలయములై సూత్రపంక్తి:
జడమొకొ ఈ జీవజగతి
గడిదేరిన మొనగాండ్రకు
గరిడీశాలగ నుంటకు
మేలుకొనును ఏ వేళనొ!
లోకమ్మున తమాషాలు
బోలెడన్ని కనుపట్టును
నిజము నిలుచు నిలుకడపై
ప్రజలయ్యది గురుతింతురు.
ఒక లవంగి హసియించును:
ఒక కురంగి మురిపించును:
ఒక హిడింబి రూక్షముగా
చూచును దహియించునట్లు.
లోకము తీరులు కనినన్
పాకములన్నియు దేలును.
భావజగతి విహరించిన
ఏవము లేవియు దోపవు.
తీయని గంధర్వ కన్య
తో, ఊయలలూగు నూహ
లను నిలిపి ఒక క్షణమ్ము
అనుశీలింపుము విశ్వము. *